# నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 119 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
08-03-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4




# "వంశధార పూర్తి చేయండి... అప్పుడే మీకు గౌరవం"

- చిన్న చిన్న పనులు చేసి పెద్ద ప్రచారం చేసుకోవద్దు
- జిల్లాకు జీవనాడి వంశధారను వెంటనే పూర్తి చేయాలి
- ఒడిశాతో ఉన్న వివాదాలు పరిష్కరించాలి
- ప్రధాని మోడీ, సీఎం సహకారంతో పనులు ముందుకు తీసుకెళ్లండి
- రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగించే ప్రాజెక్టు ఇదే
- కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడుకు వైకాపా నేతల బహిరంగ లేఖ

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా రైతాంగానికి జీవనాడిగా నిలిచిన వంశధార ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేసి రైతులకు నీరు అందించాలంటే ఇప్పటి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చిన్న చిన్న పనులు చేసి గొప్ప అభివృద్ధి చేశామంటూ ప్రచారం చేసుకోవడం కంటే శాశ్వత ప్రయోజనం కలిగించే వంశధార ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు తన గౌరవాన్ని పెంచుకోవాలని సూచించారు.
శనివారం పెద్దపాడు లోని వైకాపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...
"వంశధార ప్రాజెక్టు అనేది శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి ప్రాణాధారం. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో రైతులు మూడు పంటలు పండించుకునే స్థితి వస్తుంది. గత వైకాపా ప్రభుత్వ కాలంలో

-మిగతా 2లో

# 'బ్రాందీ షాపులే బార్లు

- సిండికేట్ గా మద్యం వ్యాపారం.
- మద్యం వ్యాపారానికి భాయ్ భాయ్.
- మద్యము అమ్మకాలకు నిబంధనలు వర్తించావ్...! కల్తీ మద్యం...?
- పేదోడి మద్యంపై 20 రూపాయలు పెంపు.....
- గ్రామ గ్రామాన అనధికార బెల్ట్ షాపులు
- ఎక్సైజ్ పోలీస్ శాఖలు చోద్యం చూస్తున్నాయి.

2లో



## నరసన్నపేట వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా
# అంధవరపు సూరిబాబు

- సీనియారిటీ, విధేయత, సమర్థతకు పార్టీ పెద్దపీట
- పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన వ్యవస్థాపక కార్యకర్త
- కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ ఛైర్మన్‌గా సేవలు
- నరసన్నపేట, ఎచ్చెర్ల, నెల్లిమర్లలో పార్టీ బలోపేతానికి కృషి



2లో

## ఒక ప్రాణం నిలవాలంటే...
# మనసున్న దాతలే ఆశ

- చావుబతుకుల మధ్య హేమంత్... ఒక ప్రాణం కాపాడే చేయి ఎక్కడ?
- కాలేయ మార్పిడికి మొత్తం రూ.33 లక్షలు అవసరం
- పేద కుటుంబానికి అంతటి ఖర్చు భరించే స్థోమత లేదు
- గత కొన్నేళ్లుగా లివర్ వ్యాధితో పోరాటం
- దాతల సహాయంతోనే ఇప్పటివరకు చికిత్స
- జీవన్దాన్‌లో నమోదు చేసిన కుటుంబం
- అంపోలు గ్రామంలో సొంత ఇల్లు కూడా లేని పరిస్థితి
- భార్య, పిల్లలు, తల్లిదండ్రుల కన్నీటి వేడుక
- సహాయం కోసం వేడుకుంటున్న కుటుంబ సభ్యులు
- చిన్న సహాయం కూడా ప్రాణరక్షణకు దారి
- శ్రీకాకుళం జిల్లాలోని ఇన్‌ఫ్లూయెన్సర్లు ముందుకు రావాలన్న విజ్ఞప్తి
- సోషల్ మీడియా ద్వారా సహాయం చేకూర్చాలని ఆశ

జీవితంతో పోరాడుతున్న ఒక యువకుడు... చేతిలో ఏమీ లేక నిరాశతో చూస్తున్న ఒక కుటుంబం... చికిత్సకు లక్షలు అవసరం... కానీ వారి దగ్గర రూపాయి లేదు. అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల హేమంత్ కుమార్ ప్రాణం ఇప్పుడు మనసున్న దాతల సహాయంపై ఆధారపడి ఉంది. అతని ప్రాణాన్ని కాపాడాలంటే కాలేయ మార్పిడి తప్పనిసరి అని వైద్యులు చెబుతుండటంతో ఆ కుటుంబం సహాయం కోసం ఎదురుచూస్తోంది.



**(నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం)**



జీవితం ముందుంది... కానీ ప్రాణం మాత్రం కరిగిపోతుంది. ఆయన కళ్లలో ఇంకా బ్రతకాలనే ఆశ ఉంది... కానీ చేతిలో డబ్బు లేదు. ఒక మనిషి ప్రాణం నిలవాలంటే ఇప్పుడు సమాజం ముందుకు రావాల్సిన పరిస్థితి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల హేమంత్ కుమార్ ప్రస్తుతం కాలేయానికి సంబంధించిన తీవ్రమైన వ్యాధితో చావుబతుకుల మధ్య పోరాడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా లివర్ సమస్యతో బాధపడుతూ ఎన్నో ఆసుపత్రుల చుట్టూ తిరిగినా పూర్తి ఉపశమనం లభించలేదు. చివరకు వైద్యులు హేమంత్ కుమార్ పరిస్థితిని పరిశీలించి కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంట్) తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ శస్త్రచికిత్సకు మొత్తం సుమారు రూ.33 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు.
అయితే పేద కుటుంబానికి చెందిన హేమంత్ కుటుంబానికి అంతటి భారీ మొత్తాన్ని సమకూర్చే స్థోమత లేదు. గత కొన్నేళ్లుగా కూడా మనసున్న దాతల సహాయంతోనే చికిత్స కొనసాగిస్తూ జీవితం నెట్టుకొచ్చారు.
ఇప్పుడు పరిస్థితి మరింత విషమించింది. ఒకవైపు ప్రాణాపాయ స్థితిలో ఉన్న కుమారుడు... మరోవైపు చేతిలో డబ్బు లేక నిస్సహాయంగా చూస్తున్న తల్లిదండ్రులు. భర్త ప్రాణం కోసం ఆరాటపడుతున్న భార్య... తండ్రి పరిస్థితి అర్థంకాక ఆందోళనలో ఉన్న చిన్నారులు... ఇలా ఆ కుటుంబం అంతా ఆవేదనలో మునిగిపోయింది.
వారి దుస్థితి ఇంతటితో ఆగలేదు. అంపోలు గ్రామంలో హేమంత్ కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదు. జీవితం గడపడానికి కూడా కష్టపడుతున్న ఆ కుటుంబానికి ఇప్పుడు లక్షల రూపాయల వైద్య ఖర్చు భరించడం అసాధ్యంగా మారింది.
హేమంత్ కుమార్ చికిత్స కోసం కుటుంబ సభ్యులు స్థానిక జేమ్స్ ఆసుపత్రిలో జీవన్దాన్ కార్యక్రమంలో తమ వివరాలను నమోదు చేశారు. కాలేయ మార్పిడి జరిగితే మాత్రమే ఆయన ప్రాణం నిలుస్తుందని వైద్యులు చెబుతున్నారు.
"మా హేమంత్ బ్రతికితే మా కుటుంబం బ్రతికినట్టే... మనసున్న దాతలు కొంచెం సహాయం చేస్తే మా భర్త ప్రాణం కాపాడవచ్చు" అంటూ భార్య కన్నీటి స్వరంతో వేడుకుంటోంది. తల్లిదండ్రులు కూడా కుమారుని పరిస్థితి చూసి తీవ్ర వేదనలో ఉన్నారు.
ఇప్పటి సోషల్ మీడియా కాలంలో చిన్న సహాయం కూడా పెద్ద మార్పు తీసుకురాగలదు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో సోషల్ మీడియా ద్వారా ఎదుగుతున్న ఇన్‌ఫ్లూయెన్సర్లు, యువత ముందుకు వచ్చి ఈ విషాద గాథను మరింత మందికి చేరవేస్తే హేమంత్ కుమార్‌కు సహాయం అందే అవకాశం పెరుగుతుందని స్థానికులు ఆశిస్తున్నారు.
ఇలాంటి పరిస్థితుల్లో ఒక ప్రాణాన్ని కాపాడటానికి ముందుకు రావడం సమాజానికి మంచి సందేశం అవుతుందని వారు భావిస్తున్నారు.
ఒక్క చిన్న సహాయం... ఒక మనిషి ప్రాణాన్ని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని కూడా నిలబెట్టగలదు. అందుకే మనసున్న దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.
సహాయం అందించేందుకు వివరాలు:

Name: U. Hemanta Kumar
A/C No: 31070101846
IFSC Code: SBIN0000919
PhonePe / GPay: 9804020039

**ఒక చిన్న సహాయం... ఒక ప్రాణానికి కొత్త జీవితం.**



జీవన్ దన్ రిజిస్ట్రేషన్ చేసిన ఉమాశంకర్

ఎడిటోరియల్

# పెట్రో భయాలు!

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. చర్చలు జరుగుతున్న వేళ అనూహ్యంగా అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి ప్రస్తుతం గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) దేశాలంతటా వ్యాపించింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది.

జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, మంగళవారానికి పది డాలర్లపైన పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున నలభై లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది.

ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల (2 బిలియన్ డాలర్లు) అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024-25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలు దువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగ వచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్య తను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్త మవుతున్నాయి. బుధవారం నాడు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40-45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందుచూపునకు నిదర్శనం.

ఈ పరిణామాల నేపథ్యంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఒత్తిడికి లొంగి, తక్కువ ధరకు లభించే రష్యా చమురు దిగుమతులను భారీగా తగ్గించేందుకు అంగీకరించిన విషయం తెలిసిందే. దీంతో రష్యా నుండి రోజుకు సుమారు 20 లక్షల బ్యారెళ్ల మేరకు వచ్చే దిగుమతులు 10 లక్షల బ్యారెళ్లకు తగ్గాయి. అమెరికాకు ఇచ్చిన హామీ ప్రకారం రానున్న రోజుల్లో దీన్ని మరింతగా తగ్గించాల్సి ఉంది. ఈ నిర్ణయంపై అప్పట్లో ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తినా కేంద్రం పట్టించుకోలేదు. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేసిన దాడి, హోర్ముజ్ జలసంధి మూసివేతతో మనదేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

నలభై రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రోధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరగుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి.

# 'బ్రాందీ షాపులే బార్లు

**నవతరం -మందస**

పలాస నియోజకవర్గంలో మద్యం షాపుల్లో అక్రమాలు యదేచ్ఛగా సాగుతున్నాయని మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందస, వజ్రపు కొత్తూరు, పలాస, కాశీబుగ్గ, పలాస మున్సిపాలిటీలలో బ్రాందీ షాపులే బార్లుగా తెరచి, కల్తీ మద్యం అమ్మకాలు జోరుగా సాగిస్తున్నప్పటికి అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహారిస్తున్నారని సర్వత్రా చర్చనీయాంసం గా మారింది. పేద వర్గాల కోసం తాము అధికారంలోకి వస్తే ?100 కి నాణ్యమైన మద్యం అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీని గాలికొదిలి పేదవాడు సేవించే మధ్యాన్నీ కూడా కల్తీ చేసి దోపిడీ చేస్తున్నారని మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిదంగా గ్రామ గ్రామాన అనధికారంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకునే విధంగా మద్యం సిండికేట్ వ్యాపారస్తులు, అధికారులు నిర్ణయించి పేదల జేబులో సొమ్ము చేసుకోవడం విశేషం.

నిబంధనలు భిన్నంగా బ్రాందీ షాపులను బార్లుగా నడిపిస్తున్నప్పటికీ ఎక్సైజ్ పోలీస్ శాఖ చర్యలు తీసుకోకపోవడం, సామాన్యుడి సేవించే మద్యం బాటిల్ పై 20 నుంచి 50 రూపాయలు వరకు పెంచి అమ్మకాలు చేస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ మౌనం వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు సాగడంతో గ్రామాల్లోని ఘర్షణలు కొట్లాటలు అసంఘిక కార్యక్రమాలు నేరాల మయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వెల్లడిస్తున్నారు. ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలు బ్రాందీ బీర్లు విక్రయించడం తో మందుబాబులు ప్రశ్నిస్తే జులుము ప్రదర్శించడం సిండికేట్లకు మద్యం వ్యాపారులు ప్రవర్తన ముక్కున వేలేసుకునే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అధిక ధరలకు విక్రయిస్తే ఎక్సైజ్ శాఖ కేసులు పెడుతుందని హెచ్చరించడం చూస్తే హాస్యాస్పదంగా కనబడడం విశేషమని పలువురు వాపోతున్నారు. మద్యం వ్యాపారంలో సిండికేట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు భాయ్ భాయ్ గా మద్యాన్ని అధిక ధరలకు విక్రయించే సొమ్ము చేసుకునే తీరు స్పష్టంగా కనబడడం ప్రజలు మందుబాబులు మద్యం వ్యాపారులు డబ్బు దగ్గర శాశ్వత శత్రుత్వం మిత్రుత్వము ఉండదనేది స్పష్టంగా కనబడుతుంది. ప్రభుత్వ ఖజానాకి కల్తీ మద్యమమ్మకాలతో లక్షలాది రూపాయలు మద్యం వ్యాపారులు బ్రాందీలు కల్తీమయం చేయడం విక్రయించడం చూస్తే అధికారులు తనిఖీలు ఏ విధంగా చేస్తున్నారన్నది స్పష్టంగా కనబడుతుందని పలువురు వెల్లడిస్తున్నారు.ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ తో పాటు పోలీస్ శాఖ జరుగుతున్న అక్రమ ( కల్తీ )మద్యం విక్రయాలపై దృష్టి సారించాలని, నిబంధనలు మేరకు నాణ్యమైన మద్యం ప్రభుత్వ ధరలకు అనుగుణంగా అమ్మకాలు జరిగాలా చూడాలని సర్వత్రా కోరుతున్నారు.

# "వంశధార పూర్తి చేయండి... అప్పుడే మీకు గౌరవం"

మొదటిపేజీ తరువాయి

వంశధార అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే దిశగా ముందుకు సాగాలి" అని పేర్కొన్నారు. ఇప్పటికీ ఒడిశా రాష్ట్రంతో ఉన్న వివాదాలు పూర్తిగా పరిష్కారం కాలేదని, వాటిని కేంద్ర స్థాయిలో చర్చించి తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడుకు సవివరంగా లేఖ పంపుతున్నామని తెలిపారు. తమ పరపతి ఉపయోగించి కేంద్రం, రాష్ట్రం కలిసి వంశధార పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధి విషయంలో గత వైకాపా ప్రభుత్వమే రిమ్స్ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్, మూలపేట పోర్టు వంటి కీలక ప్రాజెక్టులు ప్రారంభించిందని, అవి జిల్లాకు శాశ్వత అభివృద్ధికి నిదర్శనాలుగా నిలుస్తాయని కృష్ణదాస్ పేర్కొన్నారు. "శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా చిన్న చిన్న పనులు చేసి ఏదో గొప్ప అభివృద్ధి చేశామంటూ కూటమి నాయకులు ప్రచారం చేసుకోవడం సరైంది కాదు. రైతులకు నిజంగా మేలు చేయాలంటే వంశధార ప్రాజెక్టును పూర్తి చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, వైకాపా నాయకులు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, అంధవరపు సూరిబాబు, కె.వి.జి. సత్యనారాయణ, గొండు రఘురాం, దుంపల లక్ష్మణరావు, మండవిల్లి రవి, చల్లా శ్రీను, గొండు కృష్ణ, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# నరసన్నపేట వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా అంధవరపు సూరిబాబు

**నవతరం నరసన్నపేట**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా సీనియర్ నాయకుడు అంధవరపు సూరిబాబును పార్టీ నియమించింది. పార్టీ ఆవిర్భావం నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుడిగా సూరిబాబుకు గుర్తింపు ఉంది. సొంత సామాజిక వర్గంతో పాటు బీసీల అభ్యున్నతికి కృషి చేస్తూ, పార్టీ పట్ల సానుకూల వాతావరణాన్ని ఏర్పరచడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో రాష్ట్ర కళింగ వైశ్య సంక్షేమ కార్పొరేషన్ డెవలప్మెంట్ ఛైర్మన్‌గా దాదాపు నాలుగేళ్లు సూరిబాబు సేవలందించారు. అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి కడప ఎంపీగా, వైఎస్ విజయమ్మ పులివెందుల ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో పులివెందులలో వారంరోజుల పాటు ఉండి పార్టీ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అభ్యర్థుల గెలుపుకు తన వంతు కృషి చేశారు. నరసన్నపేట అసెంబ్లీ ఉపఎన్నికల సమయంలో పట్టణ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ విజయంలో కీలక పాత్ర పోషించారు. నాటి జిల్లా పార్టీ అధ్యక్షురాలు రెడ్డి శాంతి ఆధ్వర్యంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడిగా, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలో శ్రీకాకుళం నగర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కూడా సూరిబాబు సేవలందించారు. ఇక ఎచ్చెర్ల, నెల్లిమర్ల నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను క్రింది స్థాయి వరకు చేర్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. శ్రీకాకుళం జిల్లాలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ కార్యకర్తల్లో విశ్వాసం పెంపొందిస్తూ తన అంకితభావం, పనితీరు, సమర్థతతో అందరివాడిగా సూరిబాబు నిలిచారని నాయకులు పేర్కొన్నారు. నరసన్నపేట నియోజకవర్గ పరిశీలకుడిగా ఆయన నియామకంపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# లేపాక్షి బసవయ్య......
# లేచి రావయ్యా........



"లేపాక్షి బసవయ్య! లేచి రావయ్య....అని అడవి బాపిరాజుగారు ఒక కవితలో పిలుపునిచ్చారు. ఆ బసవయ్య వెలసిన లేపాక్షి అనంతపురం జిల్లాలో వుంది. ఏ క్షణాన లేచి ముందుకు ఉరుకుతుందోనని అనిపించే విధంగా చెక్కిన సజీవ శిల్పం ఈ నందీశ్వరుడు. లేపాక్షిలోని వీర భద్రాలయం సమీపంలో 15 అడుగుల ఎత్తున, 22 అడుగుల పొడుగున విస్తరించివుందీ బ్రహ్మాండమైన విగ్రహం.

108 శైవ క్షేత్రాలలో లేపాక్షి ఒకటి అని స్కాందపురాణంవల్ల తెలుస్తుంది. ఇక్కడగల పాపనాశేశ్వర స్వామి (లింగరూపం) అగస్త్య మహర్షి ప్రతిష్ఠించారని ప్రతీతి. ఒకరి కెదురుగా మరొకరుగా పాపనాశేశ్వరుడు (శివుడు), రఘునాధమూర్తి (విష్ణువు) వుండటం యిక్కడ ప్రత్యేకత.

సీతమ్మవారిని అపసహరించుకొని పోతున్న రావణాసురినితో యుద్ధం చేసి జటాయువు ఇక్కడే పడిపోయాడని రాములవారు జటాయువు చెప్పిన విషయమంతా విని, కృతజ్ఞతతో "లే! పక్షి!" అని మోక్షం ప్రసాదించిన స్థలం. అందువల్లనే ఇది క్రమంగా లేపాక్షి అయ్యిందని ఒక కథ.

విజయనగర చక్రవర్తి అయిన అచ్చుత దేవరాయల ఖజానాకు అధికారిగా విరూపణ్ణి అనే సెట్టి వుండేవాడు. అతని సోదరుడు వీరణ్ణ. ఇద్దరూ లేపాక్షి ప్రశస్తిని విని ఇక్కడ దేవాలయాన్ని పునర్నిర్మించారు. అందులో తమ కులదైవమైన వీరభద్రుని ప్రతిష్టించారు. కళ్యాణ మండపాన్ని తీర్చిదిద్దుతున్న కాలంలో దేవాలయ నిర్మాణానికై రాజుగారి ఖజానా నంతటిని విరూపణ్ణ వాడేశాడని నేరారోపణపై అతని కన్నులు పొడిచి వేయవలసిందిగా రాజుగారు ఆదేశించారట. ఇది విని విరూపణ్ణ తన రెండు కనుగ్రుడ్డులనూ తనే పెరికి వేసికొని గోడకేసి కొట్టాడట. గోడపై రెండు గుంటలు, ప్రక్కన ఎర్రటి నెత్తుటి మరకలు యిప్పటికీ కనిపిస్తాయి. లేపాక్షి ఆలయంలో శిల్పాలలో, చిత్రాలలో అందమైన కనులు అనేక జతలు కన్పిస్తాయి. వీటి రచనకు కారణమైన వ్యక్తి తన కనులను తానే పెరికి వేసుకొన వలసిన పరిస్థితి రావటం ఎంతో దురదృష్టం. అలా గ్రుడ్డివాడయిన విరూపణ్ణ ఎంతోకాలం ఆ గుడిచుట్టూ తారాడుతుండే వాడు. లేపాక్షి ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. లేపాక్షి అంటే అంధీకృతాక్షి గ్రుడ్డియైపోయిన కన్ను అన్న అర్థంకూడ కొందరు చెబుతారు.

లేపాక్షి ఆలయం శిల్పాలకు, చిత్రాలకు కూడ ప్రసిద్ధి ఇక్కడి స్తంభాలలో ఒకటి నేలకానకుండా నిలిచి వుండే విధంగా నిర్మించారు. స్తంభం అడుగునుండి ఉత్తరీయం పరచి చూడవచ్చు. దీనిని ఆకాశ స్తంభం అంటారు. ఇలాంటిది యింకొకటి కూడా వుండేదట. ఒక ఆంగ్లేయాధికారి ఇది ఎలా నిర్మించారో చూడటానికై దానిని ఎత్తిచూడ ప్రయత్నించాడు. అప్పుడు ఆలయ ముఖ మండపంపై కప్పు ప్రక్కకు వొరిగి పోయిందని చెబుతారు. ఇప్పటికీ అలాగే వుంది. దానిని ఎలా సరిచేయాలో, నేలకానిన స్తంభాన్ని తిరిగి ఎప్పటివలె ఎలా నిలపాలో ఎవరికీ అర్థం కాలేదు.


ఈ ఆలయంలో కనిపించే రంగు రంగుల చిత్రాలలో అప్పటి ప్రజల అలవాట్లు, దుస్తులు, నగలు, తల వెంట్రుకలను అందంగా కొప్పు పెట్టుకొనే రీతులు కన్పిస్తాయి. లేపాక్షి చిత్రాలలో కనిపించని తలకట్టు, నగకట్టు వుండదని ప్రతీతి. ఇప్పటికాలపు ఫ్యాషన్లు కూడ అందులో కన్పిస్తూ వుండటం విశేషం.

లేపాక్షి మండప స్తంభాల పైనా, చిత్రాలలోను 96 రేఖాగణిత రేఖాచిత్ర కల్పనలు కన్పిస్తాయి. దేవాలయములోని రంగు మండపం ఎంతో రమణీయమైనది. ఇది నిజంగా నాట్యమండపం అనవచ్చు. బ్రహ్మ మృందంగాన్ని, తుంబురుడు వీణను, నందికేశ్వరుడు హుడుక్కను, దేవతలలో ఒకరు తాళాన్ని వాయిస్తుంటారు. రంభ నాట్యం చేస్తుంటుంది.

ఈ మూర్తులన్నిటినీ వేర్వేరు స్తంభాల మీద చెక్కారు. భిక్షాటన మూర్తియైన శివుడు పార్వతినుండి భిక్ష అడిగే సన్నివేశాన్ని మనోహరంగా చెక్కటం మనం గమనించవచ్చు. మార్కండేయుని కథ, భక్త శిరియాలుని కథ వంటి అనేక పురాణ గాధలు యిక్కడ ప్రత్యక్షమౌతాయి. ఏడు పడగలనాగు నీడన వుండే శివలింగం ఒక ప్రత్యేక ఆకర్షణ. దేవతా మూర్తులు, స్త్రీ మూర్తులేగాక అనేక రకాల పక్షులు, లతలు, జంతువులు ఈ శిల్ప, చిత్ర సముదాయంలో మనకు దర్శనమిస్తాయి. దురదృష్టవశాత్తు ఇందులో కొన్ని శిల్పాలను దుండగులు పాడుచేశారు. పైకప్పు బీటలుతీసి వర్షపునీరు కారటం వల్ల క్రింద యాత్రికులు పొయ్యి రాజేసి వంటలు చేసికొనడం వల్ల పొగచూరి కొన్ని చిత్రాలు పాడయ్యాయి. మిగిలిన వాటిని సంరక్షించుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాదాపు వేయి చిత్రాలలో యింకా 200 మాత్రం మంచి స్థితిలో వున్నాయి.

లేపాక్షికి అనంతపురం, హిందూపూర్, బెంగుళూరులనుండి బస్ సౌకర్యం వుంది.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్,
ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్
కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488



# టెక్కలిలో డెంటిస్ట్ డేస్ సంబరాలు




డా.కాలి వర ప్రసాద్

**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి మండల కేంద్రంలో ప్రపంచం డెంటిస్ట్ డే సందర్భంగా టెక్కలి గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్య శాల లో సంబరాలు జరిగాయి. డాక్టర్ కాలి వర ప్రసాద్ అధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అభ్యుదయ రైతు కోత మధుసూదన్ రావు పాల్గొన్నారు. వీరితోపాటు డా. వినీషా.డా సుస్మిత తదితరలు పాల్గొన్నారు.

# అందం...అమృతం...విషం..?



ఆమె మౌనం ఒక తుఫాన్
హెచ్చరిక...

ఆమె సింహగర్జన చేసి
దుష్టుల గుండెల్లో
చూపుల గునపాలు
గుచ్చే...
నీతికి నిజాయితీకి
నిలువెత్తు నిదర్శనం
ఆమె..
ఆమె ఒక అతిలోక
సుందరి...
కానీ ఆమె దారితప్పిన
నౌక...

ఆమె ఒక అందాలరాశి...
కానీ ఆమె ఒక ఆత్మగౌరవ
శిఖరం...
దుష్టనేత్రాల సెగ తగిలినా
వాడిపోని పారిజాతం...

దుర్మార్గుల కుటిల యత్నాలను
కంటి చూపుతోనే కాల్చి వేస్తుంది
చీకటిని సూర్యకిరణం
చీల్చినట్టు...

ఆమె కంటిచూపు
ఒక నిప్పు కణిక
అది అపవిత్రతను దహించే
సుదర్శనం
సాహసం సచ్ఛీలతే ఆమె
కవచాలు

అందాలు ఆరబోసి
సర్వం అర్పించినా
తనివి
తీరని
మాయాలోకపు
బానిస...
విచక్షణ చీకటి
పాలైతే
నీచత్వం నీడలా
వెంటాడుతుంది...
చిలిపి చూపులకే
కను సైగలకే
కైపెక్కి
పడకగది
పంజరంలో
వాలిపోయే పాలపిట్ట
ఆమె... విటుల

విషపుమత్తులో
వికసించకముందే
రాలిపోయే కుసుమం ఆమె...
నిలువెల్లా నైచ్యం నిండి...
ఆలింగనమే అమృతమని నమ్మి
కసాయివాళ్ళ కౌగిళ్లతో
కీలుబొమ్మై
కన్నీటిని త్రాగిబ్రతికే విధివంచిత
ఆమె...
అవసరం తీరాక
ఆమె అంగడి సరుకే...
ఆపై ఆమె వేదన ఒక అరణ్య
రోదనే...
మోసగాళ్ళవల్లో
చిక్కిన బలిపశువు ఆమె.



కవి రత్న, సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# మహిళాభివృద్ధికి చేసే సాయం, తిరిగి సమాజానికే లబ్ధి చేకూరుస్తుంది

- బిజెపి నేషనల్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్. పద్మ.వీరపనేని
- డా.పైడి.సింధూర ఆధ్వర్యంలో "స్త్రీ శక్తి పంచకం"

**నవతరం -శ్రీకాకుళం**

మహిళాభివృద్ధికి చేసే సాయం, తిరిగి సమాజానికే లబ్ధి చేకూరుస్తుందని, బిజెపి నేషనల్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్.పద్మ.వీరపనేని అన్నారు. శ్రీకాకుళం జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. పైడి.సింధూర ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక నాగావళి హోటల్ లో శనివారం ఘనంగా జరిగాయి. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు "స్త్రీ శక్తి పంచకం" అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని, ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి మహిళకు నాడీ (పల్స్) పరీక్షలు, బోన్ డెన్సిటీ (కాల్షియం) పరీక్షలను, ముఖ్యఅతిథి డాక్టర్. పద్మ వీరపనేని (నేషనల్ ఎగ్జిక్యూటివ్, మహిళా మోర్చా), డా.మాలతి ఆధ్వర్యంలో ఉచితంగా అందించామన్నారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్. పద్మ వీరపనేని, మహిళా మోర్చా అధ్యక్షురాలు డా.పైడి.సింధూర మాట్లాడుతూ మానవ జాతి మనుగడకి మహిళలే కీలకమని, సాటి మహిళకు గౌరవం, గుర్తింపు, ఉనికి, పెట్టుబడి, న్యాయం, వనరులు, మద్దతుగా గొంతు, రక్షణ, సమయం, మెంటారింగ్... ఇలా ఎన్నో రకాలుగా సహకారమందించవచ్చని, ముఖ్యంగా మహిళలపైన ఉండే చిన్నచూపును తరిమికొట్టాలన్నారు. వివక్షను ప్రశ్నించాలని, లైంగిక హింసలను అడ్డుకోవాలని, మహిళల



విజయాలను కొనియాడాలన్నారు. విజ్ఞానాన్ని పంచుకుని, అన్ని రంగంలో ముందంజలో ఉంటూ, అవకాశాలు అందిపుచ్చుకోవటం గొప్ప విషయమన్నారు.
జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురం.తేజేశ్వర రావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ స్త్రీ పక్షపతి పార్టి అని, భారతీయ రంగంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏ ఆశయాలతో దేశాన్ని ముందుకు వెళ్తున్నారో, దానిని మనమంతా కలసి ముందుకు తీసుకువెళ్దామని, అందుకు శ్రీకాకుళం మహిళలందరూ బాగసౌమ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఇందులో బాగముగా వేదికను అలంకరించిన ప్రముఖలందరూ మహిళ ప్రాధాన్యతను, ఆరోగ్య సూత్రాలను, ఆచరించవలసిన నియమాల ప్రసంగాలతోపాటు, మహిళాదినోత్సవ విశిష్టతను వివరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళలందరినీ దుస్సాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, సెవ్వనా ఉమామహేశ్వరీ, పూర్వ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వర్, జిల్లా ప్రధానకార్యదర్శి చింతు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా లోకానికి దిక్సూచి... సత్యదేవి

- నిరుపేద కుటుంబం నుంచి ప్రారంభమైన విజయయాత్ర
- జీతానికి పని చేసిన స్థాయి నుంచి నేడు నలుగురికి ఉపాధి
- బ్యూటీ రంగంలో ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు
- 2014లో ప్రారంభమైన చాందిని బ్యూటీ క్లినిక్
- ఆధునిక సేవలతో మహిళల విశ్వాసం పొందిన నిర్వాహకురాలు
- పలువురు మహిళలకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి మార్గం
- కుటుంబ సహకారంతో విజయపథంలో దూసుకెళ్లిన మహిళ
- మహిళా దినోత్సవాన్ని సేవా భావంతో నిర్వహిస్తున్న సత్యదేవి

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం**

సంకల్పం, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన మహిళల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన సత్యదేవి ఒకరు. నిరుపేద కుటుంబంలో జన్మించి చిన్నతనం నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న ఆమె, ఒకప్పుడు జీతానికి పని చేసిన స్థాయి నుంచి నేడు ఇతరులకు జీతం ఇచ్చే స్థాయికి ఎదిగి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు. జీవితంలో వచ్చిన ప్రతి అడ్డంకిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగిన ఆమె, బ్యూటీ రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డు చౌక్‌బజార్‌లో ఆమె నిర్వహిస్తున్న "చాందిని బ్యూటీ క్లినిక్" మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.

## నిరుపేద కుటుంబం నుంచి ప్రారంభమైన ప్రయాణం

సత్యదేవి శ్రీకాకుళం నగరంలోనే జన్మించి పెరిగారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో చిన్నప్పటి నుంచే కష్టాలను ఎదుర్కొన్నారు. జీవనోపాధి కోసం పలు షాపుల్లో జీతానికి పనిచేస్తూ కుటుంబానికి తోడ్పాటునిచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా జీవితంలో ఏదో సాధించాలని తపనపడేవారు. కష్టపడి పనిచేస్తే ఒకరోజు తప్పకుండా విజయం సాధించవచ్చనే



నమ్మకం ఆమెను ఎప్పుడూ ముందుకు నడిపించింది.

## పత్రికా రంగంలో అనుభవం

జీవితంలో కొత్త అనుభవాలు సంపాదించాలనే ఉద్దేశంతో కొంతకాలం పత్రికా రంగంలో కూడా పనిచేశారు. ప్రజల సమస్యలు, సమాజంలో జరుగుతున్న మార్పులను దగ్గరగా చూసే అవకాశం ఆమెకు లభించింది. ఆ అనుభవం జీవితంపై మరింత అవగాహన కలిగించింది. అదే సమయంలో మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాల్సిన అవసరం ఉన్నదని ఆమెకు స్పష్టమైంది.

## వివాహం తర్వాత కొత్త దారి

2004లో ఆర్మీ ఉద్యోగి వెంకటరాజేశ్వరరావుతో సత్యదేవి వివాహం జరిగింది. భర్త ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడంతో ఆమె జీవితంలో కొత్త మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త నగరంలో కొత్త అవకాశాలను వెతుక్కుంటూ తనకు ఇష్టమైన రంగంలో ఎదగాలని నిర్ణయించుకున్నారు.

## బ్యూటీ రంగంలో శిక్షణ

చిన్నప్పటి నుంచే బ్యూటీ రంగంపై ఆసక్తి ఉన్న సత్యదేవి హైదరాబాద్‌లో ప్రముఖ శిక్షణ సంస్థల్లో బ్యూటీ థెరపీ, హెయిర్ స్టైలింగ్, బ్రైడల్ మేకప్, స్కిన్ ట్రీట్‌మెంట్ వంటి అనేక అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. అనుభవజ్ఞులైన నిపుణుల వద్ద మెళకువలు నేర్చుకుంటూ తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకున్నారు. శిక్షణతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని కూడా సంపాదించారు.

## చాందిని బ్యూటీ క్లినిక్ ప్రారంభం

శిక్షణ పూర్తయిన తర్వాత స్వంతంగా ఏదైనా చేయాలనే సంకల్పంతో 2014లో శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డు చౌక్‌బజార్‌లో లి"చాందిని బ్యూటీ క్లినిక్"లిను ప్రారంభించారు. ప్రారంభంలో చిన్న గదిలో ప్రారంభమైన ఈ క్లినిక్ క్రమంగా అభివృద్ధి చెందుతూ మహిళల విశ్వాసాన్ని సంపాదించింది. నాణ్యమైన సేవలు, ఆధునిక పద్ధతుల్లో అందించే చికిత్సలు ఆమె క్లినిక్‌కు మంచి పేరు తెచ్చిపెట్టాయి. చర్మ సంరక్షణ, హెయిర్ కేర్, బ్రైడల్ మేకప్ వంటి అనేక సేవలను అందిస్తూ మహిళల ఆదరణను పొందుతోంది.

## మహిళలకు ఉపాధి అవకాశాలు

సత్యదేవి తన విజయాన్ని మాత్రమే కాకుండా ఇతర మహిళల అభివృద్ధిని కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్యూటీ రంగంలో ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తున్నారు. ఆమె వద్ద శిక్షణ పొందిన పలువురు మహిళలు ప్రస్తుతం తమ స్వంత బ్యూటీ పార్లర్లు నిర్వహిస్తూ జీవితంలో నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం కూడా ఆమె క్లినిక్‌లో పలువురు యువతులు పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు జీతానికి పనిచేసిన సత్యదేవి నేడు ఇతరులకు జీతం ఇచ్చే స్థాయికి ఎదగడం ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



## కుటుంబ సహకారమే బలం

సత్యదేవి విజయానికి కుటుంబ సభ్యుల సహకారం కీలకం. ఆమె కుమార్తె కుసుమ ప్రస్తుతం తిరుపతిలో వైద్య విద్య అభ్యసిస్తోంది. కష్టపడి చదివి ఫ్రీ సీట్ సాధించిందని సత్యదేవి గర్వంగా చెబుతున్నారు. కుమారుడు సేతుమాధవ్ టెక్కలిలోని ఐటిఎమ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. భర్త వెంకటరాజేశ్వరరావు ఆర్మీ నుంచి పదవీ విరమణ అనంతరం ప్రస్తుతం ఎన్‌ఏసీఎల్‌లో ఎస్‌వోగా పనిచేస్తున్నారు. కుటుంబం అందించిన ప్రోత్సాహం, సహకారమే తన విజయానికి ప్రధాన కారణమని సత్యదేవి అంటున్నారు.

## మహిళా దినోత్సవం ప్రత్యేకంగా

ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవాన్ని తమ బ్యూటీ క్లినిక్‌లో సాదాసీదాగా నిర్వహించడం సత్యదేవి ప్రత్యేకత. మహిళలతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకుంటారు. అలాగే క్యాలెండర్లు రూపొందించి పంపిణీ చేస్తూ మహిళలకు అవగాహన కల్పిస్తారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

## మహిళలకు సందేశం

మహిళలు చదువు పూర్తిచేసుకుని తమకు ఇష్టమైన రంగంలో కృషి చేస్తే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చని సత్యదేవి చెబుతున్నారు. ఒకప్పుడు మహిళలు వంటింటికే పరిమితమయ్యేవారు కానీ ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆమె అభిప్రాయపడుతున్నారు. బ్యూటీ రంగం కూడా మహిళలకు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని ఆమె అంటున్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే కుటుంబం మాత్రమే కాదు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఆమె ప్రగాఢంగా నమ్ముతున్నారు.

"మహిళలు కష్టపడితే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరు. ఆర్థిక స్వావలంబన సాధిస్తే సమాజ అభివృద్ధి తప్పనిసరిగా జరుగుతుంది." --
**- సత్యదేవి**

# "ఉద్యోగం పురుష లక్షణం"

ప్రయత్నం చేస్తే పని జరుగుతుంది
ధైర్యంగా నడిస్తే దారి కనిపిస్తుంది
కూర్చుంటే ఏదీ చేతికి రాదు
ముందుకు అడుగేస్తే విజయం చేరుతుంది

చీమ చిన్నదైనా నడక మొదలెడితే
వేల మైళ్ళు దూరం వెళ్లగలుగుతుంది
గరుత్మంతుడైనా కూర్చుని ఉంటే
ఒక్క అడుగు కూడా ముందుకు పోదు

మనసులో నమ్మకం ఉండాలి
ప్రయత్నం ఎప్పుడూ సాగాలి
సాధన చేస్తే పనులు అవుతాయి
కష్టపడితే ఫలితాలు వస్తాయి

సమస్య వచ్చినా భయపడక
పరిష్కారం కోసం వెతకాలి
ఆగిపోకుండా ముందుకు నడిస్తే
జీవితంలో విజయం దొరుకుతుంది

ఉద్యోగం అంటే ప్రయత్నమే
మనిషి ధర్మం కృషియే

ధైర్యంగా ముందుకు సాగితే
మన జీవితం వెలుగుతుందే

శుభమస్తు



**-తేరాల రాజేంద్ర ప్రసాద్**
రత్న లహరి ఛానల్ సీఈవో
9297109223 సికింద్రాబాద్

## అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీకి రక్తదానం

**నవతరం-వజ్రపుకొత్తూరు**



వజ్రపుకొత్తూరు మండలం పాత టెక్కలి గ్రామానికి చెందిన కె పావని అనే గర్భిణీ రక్తహీనతతో బాధపడుతుంది. తన బ్లడ్ గ్రూప్ బి నెగిటివ్ కావడంచే రక్త దాతలు కొరకు వారం రోజులుగా వెతుకుతున్నారని తెలుసుకున్న పలాస వాసి అయినటువంటి ఎ అశోక్ వెంటనే స్పందించి ఆ గర్భిణీకి అవసరమైన బి నెగిటివ్ బ్లడ్ పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ లో డొనేట్ చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఆయన కోరారు.

### భావిభారత నిర్మాణంలో రాబోయే తరం
## ఎంతో దృఢంగా ఉండాలి

- శర్వాణి విద్యాలయ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు
- శర్వాణిలో ప్రాజెక్ట్ డే ఫర్ సబ్ జూనియర్స్

**నవతరం-శ్రీకాకుళం**

నగరంలోని అరసవిల్లి రోడ్ లోగల శర్వాణి విద్యాలయలో శనివారం ప్రాజెక్ట్ డే ఫర్ సబ్ జూనియర్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ పసి ప్రాయంలోనే పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. భావిభారత నిర్మాణంలో రాబోయే తరం ఎంతో దృఢంగా ఉండాలని, అందులో భాగంగానే ఈ సబ్ జూనియర్స్ ప్రాజెక్టు ఎక్స్పో ను నిర్వహిస్తున్నామన్నారు. కరెస్పాండంట్ ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ తమ సంస్థ అధినేత ఆశయాలకు అనుగుణంగా, లెర్నింగ్ బై డూయింగ్ సిద్ధాంతంలో భాగంగా విద్యార్థులు బాల్యం నుండి పనిఅనుభవ సారాన్ని ఈ ఎక్స్పో లో ప్రదర్శిస్తున్నారన్నారు. హెడ్ మిస్ట్రెస్ డా.కె.రేఖ మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్య దశలోనే బిడియాన్ని నియంత్రించి వ్యక్తిత్వ వికాసానికి ఇటువంటి ఎక్స్పోలు దోహదపడతాయని, శర్వాణి మౌలిక సిద్ధాంతమైన అవగాహనతో అభ్యసనం ద్వారా అత్యుత్తమ ఫలితాలను తాము సాధించగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా మెజర్మెంట్ పార్క్, ఫెస్టివల్స్, సీజన్స్, ట్రిపుల్ ఆర్ ప్రిన్సిపల్, హ్యూమన్ బాడీ ఆర్గాన్ సిస్టమ్స్, నంబర్ గేమ్, ప్రిపోజిషన్స్, పక్షాలు- తిథులు, టెన్సెస్ గేమ్, వి ఆర్ హెల్పర్స్, బటర్ ఫ్లై రైం, డే అండ్ నైట్ ఫార్మేషన్, ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు మ్యాథ్ పజిల్స్, హిందీ మహినోకే నామ్ వంటి ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### 10వ తరగతి విద్యార్థులకు
## పరీక్ష సామాగ్రి పంపిణీ



**నవతరం-నందిగాం**

నందిగాం మండలం లో కాపు తెంబూరు, తురకలకోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న 50 మంది విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ప్రతి విద్యార్థికి ప్లాంక్,పెన్, పెన్సిల్ పంపిణీ కార్యక్రమం చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. టెక్కలి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో సుమారు1500 మందికి స్టేషనరీ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.
మా అభయం యువజన సేవా సంఘం పై నమ్మకంతో ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన దాతలందరికీ అభయం యువజన సేవా సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, ఉంగరాల గోవింద రావు, కూర్మపు కల్యాణ్ పాల్గొన్నారు.

## మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

### నగదు చెక్కును అందజేసిన అదనపు ఎస్పీ కె.వి రమణ



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా హోంగార్డు యూనిట్ నకు చెందిన హోంగార్డు పాలవలస భాస్కరరావు హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల ఫిబ్రవరి నెలలో మృతి చెందారు.ఈ నేపథ్యంలో భాస్కరరావు సతీమణి పి రాజేశ్వరినకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ కెవి రమణ నగదు చెక్కును అందజేశారు. శ్రీకాకుళం జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు అందరు స్వచ్ఛందంగా అందించిన ఒక రోజు దినసరి గౌరవ వేతనాన్ని (అలవెన్స్) సమకూర్చి ఆర్థిక సహాయం రూపంలో మొత్తం రూ.4 లక్షల,8 వేల రూపాయలు- నగదు చెక్కును అదనపు ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు.హోంగార్డులు విధి నిర్వహణలో మృతి చెందిన లేదా పదవీ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులంతా తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందిస్తున్నారు. సహచర ఉద్యోగికి సహాయం చేస్తూ హోంగార్డు అందరు ఐక్యత భావాన్ని చాటారుని ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కొనియాడారు. నగదును కుటుంబం, పిల్లల భవిష్యత్తు నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ సి హెచ్ గోపినాథ్, ఆర్.ఐ. వెంకట రమణ, ఆర్ ఎస్సై హరనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

### మహా.."శక్తి"
## మహిళ

- పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత
- మాచన రఘునందన్



తల్లి, చెల్లి,స్నేహితురాలు,భార్య, ఇలా.. మహిళ ఏ రూపం లో ఉన్నా .పురుషుల దురలవాట్లపై యుద్ధ భేరీ మోగించగల సత్తా నారీ శక్తి దేనని,తమ తమ్ముళ్ళు,అన్న లు, భర్త చెడు అలవాట్ల కు కేరాఫ్ అడ్రస్ కాకుండా.. సన్మార్గంలో నడిపించగల శక్తి "మహిళ" అని, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘునందన్ శనివారం హైదరాబాద్ లో మాట్లాడుతూ..
చెడు ను తుదముట్టించి,మంచి పనిచేసే మహా శక్తి మహిళ అని అన్నారు.మహిళా శక్తి తోనే..గొప్ప మార్పు సాధ్యం అని అన్నారు. గుట్కా, బీడీ, సిగరెట్ వంటి వ్యసనాలను ఆయా వ్యక్తుల నుంచి దూరం గా తరిమి కొట్టే శక్తి,యుక్తి "మహిళ" అని రఘునందన్ అభివర్ణించారు.




Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**